సాక్షి కాకినాడ

శనివారం । 1 । ఫిబ్రవరి । 2025



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


మామిడికుదురు: అప్పనపల్లి బాలాజీ నిత్యాన్న దానం ట్రస్టుకు ఏరువ కేశవరెడ్డి, లక్ష్మి దంపతులు(హైదరాబాద్) శుక్రవారం రూ.లక్షా రెండు వేలు విరాళంగా అందించారు.



నిత్యాన్నదానానికి రూ.1.85 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి చిట్టిమడుగుల యజ్ఞేశ్వర రామసత్యనారాయణ (తెనాలి) రూ.1.85 లక్షల విరాళాన్ని అందజేశారు.

డెల్టాకు 8,379 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,379 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,472, మధ్య డెల్టాకు 1,607, పశ్చిమ డెల్టాకు 4,300 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.15 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

కోడ్ కత్తికి 'సాన' పట్టరా?



ఎంపీ సానా సతీష్ పేరిట ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద కాకినాడ వచ్చే మార్గంలో టీడీపీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ముఖద్వారం అధికారులకు పట్టడం లేదు. పట్టభద్రుల ఎన్నికల శంఖారావం మోగడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో పిఠాపురం నుంచి కాకినాడ వచ్చే మార్గంలో అచ్చంపేట జంక్షన్ వద్ద ఇటీవల ఎంపీ సానా సతీష్‌కు స్వాగతం పలుకూతు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. చిన్న చిన్న ఫ్లెక్సీలను తొలగించిన రెవెన్యూ అధికారులు దీనిని మాత్రం విడిచిపెట్టడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హాకీ టోర్నీకి ప్రత్యేక కమిటీలు



హాకీ టోర్నీ ఏర్పాట్లపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15 నుంచి 28వ తేదీ వరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అంశాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తూ కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 15 నుంచి 28వ తేదీ వరకూ డీఎస్ఏ స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ అధ్యక్షతన, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, సీపీవో, డీఎస్డీవోలు సభ్యులుగా ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీ, వివిధ ఉప కమిటీల సహకారంతో టోర్నమెంట్ నిర్వహణను పర్యవేక్షిస్తుందని తెలిపారు. అనంతరం టోర్నమెంట్ నిర్వహణకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు తెలిపిన స్పాన్సర్ సంస్థలు, తదితర అంశాలపై కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ రాహుల్‌మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన, డీఎస్డీవో బి.శ్రీనివాసకుమార్, జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఆర్అండ్‌బీ ఎస్ఈ జె.కాంతు, డీఎంహెచ్ఓ నరసింహనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో నరసింహనాయక్

కాకినాడ సిటీ: ఆడ శిశువు పట్ల వివక్షతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ, జిల్లా స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన 157 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ నెల నుంచి జనవరి వరకు 38 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 316 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. డీఎల్ఏటీవో డాక్టర్ రమేష్, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు, వైద్యాధికారులు ఎస్.స్వప్న, పి.సరిత, పి.ఈశ్వరుడు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

అయ్యో బాభూయ్!

- ప్రజలపై బాబు సర్కార్ మరో భారం
- ఆకాశాన్నంటిన భూముల ధరలు
- వాణిజ్య ప్రాంతాల్లో 20 నుంచి 50 శాతం పెంపు
- పట్టణాలు మండలాల్లో 10 నుంచి 20 శాతం పెంపు
- ప్రతిపాదనలకు జేసీ ఆమోదం
- నేటి నుంచి కొత్త ధరలు అమలు



కాకినాడ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద బారులు తీరిన క్రయ విక్రయదారులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: భూముల ధరలకు రెక్కలు వచ్చేశాయి. ప్రజల నెత్తిన కూటమి ప్రభుత్వం పిడుగులు వేసింది. నిన్నమొన్నటి వరకు విద్యుత్ చార్జీలు ఎడాపెడా పెంచేసి అన్ని వర్గాలపై ఆర్థిక భారాన్ని మోపిన ప్రభుత్వం... ఆ బిల్లులు కట్టలేం మొర్రో అంటుంటే ఇప్పుడు భూముల ధరలను పెంచేసి రిజిస్ట్రేషన్లు చేసుకునేవారికి మరో భారాన్ని నెత్తిన పెట్టింది. ఆయా సబ్‌రిజిస్ట్రార్‌లు, ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్‌లు, కౌడా అధికారులు కలిసి తయారు చేసిన ఈ పెంపుదల ప్రతిపాదనలు జాయింట్ కలెక్టర్‌కు సమర్పించడంతో ఆయన పరిశీలించి ఆమోదించారు.

పెంపు ఇలా (శాతాల్లో)...

- కార్పొరేషన్లలో నివేశనా స్థలాలకు 5 నుంచి 15
- వాణిజ్య స్థలాలకు 10 నుంచి 20
- మున్సిపాలిటీల్లో నివేశనా స్థలాలకు 10 నుంచి 30
- వాణిజ్య స్థలాలకు 10 నుంచి 50
- పంచాయతీల్లో రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో 10 నుంచి 50
- నివేశనా స్థలాలకు 10 నుంచి 20
- వ్యవసాయ భూములకు 10 నుంచి 30

ఇలా కూటమి సర్కార్ ప్రజలపై పెనుభారాన్ని మోపింది. కాకినాడ జిల్లాలో ఒక జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి ద్వారా చిన్నా పెద్దా కలిపి రోజూ 500 రిజిస్ట్రేషన్లతో రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తోంది. కాకినాడ నగరపాలక సంస్థ సహా తుని, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీలలో అన్నింటా భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.

వాణిజ్య ప్రాంతాల్లో..

కాకినాడ టౌన్‌హాల్ వీధి, శ్రీనగర్, 50 బిల్డింగ్ సెంటర్, పిఠాపురం రోడ్డు, రామస్వామివీధి, జవహర్‌వీధి, మార్కెట్ వీధి, దంటువారి వీధి, ఎస్‌బీఐ, సుభాష్ వీధి, మెయిన్ రోడ్డుకు ఆనుకుని రెండువైపులా ఉన్న వాణిజ్య వ్యాపారాలు జరుగుతున్న వీధుల్లో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. ఇప్పుడు ఈ వీధులలో భూముల ధరలు ప్రభుత్వ నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం గతంలో గజం రూ. 95 వేలు ఉండగా ప్రస్తుతంగా రూ.1.10 లక్షలకు చేరుకుంది.

నివాసాలను వదిలిపెట్టలేదు

కమర్షియల్ ప్రాంతాల్లోని స్థలాలే కాకుండా నివేశనా స్థలాలపై కూడా ప్రభుత్వం భారం మోపింది. కాకినాడ జిల్లాలో నివాస ప్రాంతాల్లో గజం 5 శాతం నుంచి 30 శాతం వరకు పెంచారు. ఉదాహరణకు కాకినాడ ఏటిమొగ ప్రాంతంలో ఇప్పుడు గజం రూ.7 వేలు ఉంటే ఇది శనివారం నుంచి 10 నుంచి 20 శాతం పెరిగినట్టే. తిలక్‌వీధి, సూర్యనారాయణపురం, గాంధీనగర్, రామారావుపేట, అచ్యుతాపురం, నూకాలమ్మ టెంపుల్ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం గజం రూ.23 వేలు ఉంది. కూటమి సర్కార్ గజం ఈ ప్రాంతాల్లో 15 నుంచి 20 శాతం వరకు పెంచి ప్రజలపై భారాన్ని మోపింది.

నిర్మాణాల విలువ పెంపు

ఆర్‌సీసీ భవనాలు, మట్టి మిద్దెలు, రేకుల షెడ్లు, సెల్లార్, సినిమా హాళ్లు, పరిశ్రమలు, పూరిళ్లు తదితర నిర్మాణాల (కట్టుబడి) విలువలను కూడా పెంచారు. వీటి మార్కెట్ విలువను ప్రస్తుతం చదరపు అడుగుకు 10 శాతం నుంచి 20 శాతం వరకు పెంచారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూముల ధరలను పెద్దగా పెంచకుండా ప్రజలపై భారం పడకుండా ఉదారంగా వ్యవహరించింది. కోవిడ్ విలయంతో ప్రజలపై భారం పడుతుందనే ఉద్దేశంతో రెండేళ్ల పాటు భూముల ధరల పెంపు జోలికి వెళ్లలేదు. కోవిడ్ తరువాత స్వల్ప పెంపుదలతోనే సరిపెట్టారు. అధికారంలోకి వచ్చాక సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు సంపద సృష్టి అంటే ప్రజలపై మోయలేనిభారం వేయడమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

భూమి రేట్ల విలువలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెరుగుతాయని సమాచారం తెలియడంతో క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ముందుకు వచ్చారు. దీంతో సాధారణ రోజుల్లో 50 నుంచి 60 రిజిస్ట్రేషన్లు జరిగేవి. రెండు రోజులుగా 90 నుంచి 150 రిజిస్ట్రేషన్లు వరకు జరిగాయి.

పల్లెల్లో పెరిగిన ధరలు (రూ.లలో) ఇలా...

గ్రామం	ప్రస్తుతం (గజం)	పెరిగిన తర్వాత (గజం)
మాధవపట్నం	6,900	9,000
పనసపాడు	7,000	9,000
తిమ్మాపురం	9,000	10,000
తమ్మవరం	6,000	8,000
వాకలపూడి/ వలసపాకల	11,000	15,000
గంగనాపల్లి	10,000	20,000
ఎస్.అచ్యుతాపురం	20,000	25,000
తూరంగి	20,000	25,000
నడకుదురు	10,000	15,000

మాఘమాసం ప్రారంభం కావడంతో గురువారం కాకినాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 135 రిజిస్ట్రేషన్లు జరగ్గా, శుక్రవారం రాత్రి వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో 150 రిజిస్ట్రేషన్లు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి క్రయవిక్రయదారులు ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లాలోని ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద వేచి ఉన్నారు.

ప్రాంతాన్ని బట్టే భూమి విలువ పెరిగింది



ఆయా ప్రాంతాలు నివాసాలు, కమర్షియల్ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రైవేటుగా ఉన్న భూములు విలువలు ఆధారంగా ధరల పెంపు జరిగింది. మున్సిపల్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, కౌడా తదితర శాఖల సమన్వయంతో ఈ ప్రతిపాదనలను తయారు చేశారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఫైల్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదించగా ఆయన ఆమోదించారు.

– ఆర్‌వీ రామారావు, జాయింట్ –1 సబ్ రిజిస్ట్రార్, కాకినాడ

వైఎస్సార్ సీపీ నేత సోమరాజు మృతి



సోమరాజు (పాత చిత్రం)

తుని రూరల్ : వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు(76) మృతి చెందారు. గురువారం రాత్రి ఎస్.అన్నవరంలో స్వగృహంలో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇటీవల ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటి వద్దే చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం ఎస్.అన్నవరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. 1992 నుంచి వరుసగా జరిగిన ఐదు ఎన్నికల్లో ఎస్.అన్నవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడిగా ఎన్నికై రైతులకు విశేష సేవలు అందించారు. 30 సంవత్సరాలు పదవిలో కొనసాగిన ఆయన 2019 నుంచి డీసీసీబీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడిగా ఉన్నారు. భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌వీవీ.కృష్ణంరాజు, లోవ దేవస్థానం మాజీ చైర్మన్‌లు లాలం బాబ్జి, దూలం మాణిక్యం సోమరాజు మృతదేహాన్ని సందర్శించి, నివాళులు అర్పించారు.

పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి

మాజీ ఎంపీ తలారి రంగయ్య



మాట్లాడుతున్న నాయకులు

పిఠాపురం: ఎన్నికల్లో ఇష్టారాజ్యంగాహామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాకా వాటిని నెరవేర్చలేం అంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రకటించి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించాలని అనంతపురం మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య డిమాండ్ చేశారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గ సమన్వయకర్త వంగా గీత విశ్వనాథ్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలం అయింది. మీరు మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రభుత్వం అమలు చేయకపోతే కాలర్ పట్టుకొని అడగండని మంత్రి నారా లోకేశ్ మీడియా ముఖంగా చెప్పారని, అయినా ఎందుకు అడగడం లేదని ఆయన పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. సంక్షేమ క్యాలండర్‌ను విడుదల చేయాలని లేదా ఇవ్వలేమని మీరు కూడా చేతులెత్తేస్తారో తేల్చి చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోని ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా దేశంలో ఏ నాయకుడు చూడనట్టుగా అతి పవిత్రంగా చూసారని చెప్పారు. 99 శాతం అమలు చేసారన్నారు. చంద్రబాబు ది మాటల ప్రభుత్వమే కానీ చేతల ప్రభుత్వం కాదని దుయ్యబట్టారు. వంగా గీత మాట్లాడుతూ కూటమి నేతలు మేము సంపద సృష్టిస్తాం, నిధులు సమకూరుస్తాం సూపర్ సిక్స్ కచ్చితంగా అమలు చేస్తామంటు చెప్పారన్నారు. అలాంటిది ఇప్పుడు రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగో లేదని మాట మారుస్తున్నారని ఆమె అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నికల ముందు తెలియదా అని ఆమె ప్రశ్నించారు. అన్ని తెలిసి మోస పూరిత హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేసారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు వారికి అండగా ఉండి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, నాయకులు గండేపల్లి బాబీ, జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రావుల మాధవరావు, పిఠాపురం నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మహిమాన్విత క్షేత్రం అంతర్వేది



అంతర్వేది క్షేత్రంలో ప్రధాన ఆలయ గోపురం



అంతర్వేది క్షేత్రంలో పూజలు అందుకుంటున్న స్వామి

- 4 నుంచి నరసన్న కల్యాణోత్సవాలు
- 13వ తేదీ వరకు తొమ్మిది రోజులు సందడి

సఖినేటిపల్లి: మహిమాన్వితమైనది అంతర్వేది లక్ష్మీనృసింహుని క్షేత్రం. ఆంధ్ర రాష్ట్రంలో విరాజిల్లుతున్న నారసింహక్షేత్రాల్లో ఈ క్షేత్రం పురాణ ప్రసిద్ధి చెంది, చారిత్రకత ప్రాధాన్యతను సంతరించుకుంది. దక్షిణ కాశీగా పేరొందిన ఈ క్షేత్రంలో లక్ష్మీనృసింహస్వామి శిలారూపంలో పశ్చిమ ముఖంగా అవతరించడం విశేషం. కృతయుగ ఆరంభంలో సృష్టికర్త బ్రహ్మ రుద్రయాగం చేయడానికి నిర్ణయించి, ఆ యాగ వేదికగా సాగరసంగమం తీరమైన అంతర్వేది గ్రామాన్ని ఎంపిక చేసినట్టు ఆలయ చరిత్ర చెబుతోంది. యాగరక్షణకు నీలకంఠేశ్వరుడిని ప్రాణప్రతిష్ఠ చేసి, యాగం పూర్తి చేశారు. బ్రహ్మయాగ వేదికగా ఉన్న ఈ గ్రామానికి తొలుత అంతర్వేదికగా పేరొచ్చింది. కాలక్రమంలో అది అంతర్వేదిగా స్థిరపడింది. నీలకంఠేశ్వరుడు క్షేత్ర పాలకునిగా కొలువుదీరినది అంతర్వేది. ఏటా మాఘమాసంలో శుద్ధ సప్తమి(రథసప్తమి)నుంచి తొమ్మిది రోజుల పాటు క్షేత్రంలో లక్ష్మీనృసింహుని దివ్య తిరుకల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తారు.

అత్యంత ప్రధాన ఘట్టాలు

ఫిబ్రవరి 4నుంచి 13వ తేదీ వరకూ నిర్వహించే స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించుకుంటారు. ఉత్సవాలు ప్రారంభం రోజు 04వ తేదీ రథసప్తమి పర్వదినం. ఆ రోజు స్వామి సూర్యవాహనంపైన, చంద్రప్రభ వాహనంపైన అర్చకులు గ్రామోత్సవం నిర్వహిస్తారు. తదనంతరం ధూపసేవ పిమ్మట శ్రీస్వామి వారిని పెండ్లి కుమారుని, అమ్మవారిని పెండ్లి కుమార్తె చేసే ఘట్టం ముద్రికాలంకరణ నిర్వహిస్తారు. 7వ తేదీ దశమి తిథి నాడు పంచముఖ ఆంజనేయస్వామి వాహనం, కంచుగరుడ వాహనంపైన స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 12–55 గంటలకు మృగశిరా నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశంలో కనులపండువగా శ్రీస్వామివారి తిరు కల్యాణం నిర్వహిస్తారు. కల్యాణం మరునాడు 8వ తేదీ భీష్మ ఏకాదశి రోజు మధ్యాహ్నం 2–05 గంటలకు రథోత్సాన్ని నిర్వహిస్తారు. 12వ తేదీ మాఘ పౌర్ణమి రోజున చక్రవారి సముద్ర స్నానం ఘట్టం నిర్వహిస్తారు. స్వామితో అసంఖ్యాకమైన భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. 13వ తేదీ అంతర్వేదిలో హంసవాహనంపై శ్రీస్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహిస్తారు. రాత్రి ఉత్సవరులకు తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీపుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్టి, శ్రీస్వామివారి పవళింపు సేవ నిర్వహించడంతో ఉత్సవాలు పూర్తవుతాయి.

పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాకినాడ నగరంలో వివిధ పోలింగ్ స్టేషన్లను కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు శుక్రవారం పరిశీలించారు. జిల్లా పరిషత్, పీడీ గృహనిర్మాణశాఖ, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, విద్యుత్, షామియానా, కుర్చీలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కాకినాడ డివిజన్‌లో 65 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అర్బన్ తహసీల్దార్ వి జితేంద్ర, సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీనియర్ తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులతో డీఎస్‌డీఓ శ్రీనివాసకుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కరరెడ్డి స్టేడియంలో జనవరి 28 నుంచి 30 వరకు జరిగిన జాతీయ స్థాయి సీనియర్స్ తైక్వాండో పోటీలలో జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారని తైక్వాండో సంఘ కార్యదర్శి బి.అర్జునరావు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలలో పాల్గొన్న హరికిరణ్, లక్కి రజత పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్‌ను క్రీడాకారులు డీఎస్ఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, నేషనల్ రిఫరీ ఎం.హర్షవర్ధన్‌లను శ్రీనివాస్ కుమార్ అభినందించారు. కోచ్‌లు డిఎస్ఎన్ మూర్తి, కేవి సత్యన్నారాయణ, జి.తులసి, పి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

'సత్రం డోనార్ స్కీం'కు రూ.5,01,001 విరాళం



ఈఓ సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత నరేష్‌బాబు కుటుంబ సభ్యులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 'సత్రం డోనార్ స్కీం' కింద సికింద్రాబాద్‌కు చెందిన చేకొండ నరేష్‌బాబు, విజయ, రంజిత, వినిత కుటుంబ సభ్యులు రూ.5,01,011 విరాళాన్ని ఈఓ వీర్ల సుబ్బారావుకు శుక్రవారం అందచేశారు. ఆ స్కీం కింద హరిహరసదన్ సత్రంలో ఒక గదిని కేటాయించాలని వారు కోరారు. దాతలకు ఆ సత్రంలో ఒక గదిని కేటాయించి ఈ స్కీం కింద లభించే అన్ని సదుపాయాలు అందజేయాలని ఈఓ ఆదేశించారు.

జీజీహెచ్‌లో శిశు ఆధార్ సేవలు ప్రారంభం

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో శుక్రవారం శిశు ఆధార్ సేవలు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రి గైనిక్ వార్డులోని బర్త్ రిజిస్ట్రేషన్ విభాగంలో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. సీఎస్ఆర్ఎంవో డాక్టర్ రాజకుమారి రిజిస్ట్రార్‌గా వ్యవహరించనున్న శిశు ఆధార్ సేవలు జీజీహెచ్ ఎంఆర్‌డీ సెక్షన్ ఆధ్వర్యంలో అందించనున్నారు. శిశువుకు ఆధార్‌కార్డు మంజూరు చేయడమే ఈ సేవల లక్ష్యం. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, డిప్యూటీ కలెక్టర్ ఎన్.శ్రీధర్, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, ఎంఆర్‌డీ ఎంఆర్‌వో జయచంద్ర పాల్గొన్నారు.

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ప్రారంభం

కాకినాడ రూరల్: రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు తొలిసారిగా ప్రైవేట్ రంగానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో జిల్లాలో కొత్తూరు జంక్షన్ వద్ద ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీసీ) అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం ఉదయం ఏటీసీను పూజలు నిర్వహించిన ఏటీసీ కంట్రోల్ ఆల్‌ఫిక్స్ సొల్యూషన్స్ సంస్థ నిర్వాహకులు చెరుకూరి కిరణ్, పొట్లూరి బుచ్చిబాబు ప్రారంభించారు. తమ సెంటరులో ఒకే సమయంలో నాలుగు వాహనాలకు టెస్టింగ్ చేయవచ్చని, 20 నిముషాల్లో ఒక వాహనానికి సర్టిఫికెట్ జారీ చేయవచ్చన్నారు.

క్లుప్తంగా

ఇసుక లారీల సీజ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై మల్లికార్జునరెడ్డి

ఐ.పోలవరం: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న లారీలను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలోని ఎదుర్లంక ఏటిగట్టు పైనుంచి గురువారం అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను స్థానిక రామాలయం పేట గ్రామస్తులు రహదారిపై మంటలు వేసి అడ్డుకున్నారు. స్థానికులు 100కు కాల్ చేసి రెవెన్యూ, పోలీసు అధికారులు రావాలని పట్టుబట్టారు. దీనితో సంఘటనా స్థలానికి ఎస్సై మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలసి వచ్చారు. స్థానికులతో మాట్లాడి ఇసుకతో వెళ్తున్న నాలుగు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

సర్పంచ్ లాగిన్ ఫోర్జరీ చేశారని ఆరోపణ



తాళ్లపూడి పంచాయతీలో మాట్లాడుతున్న సర్పంచ్, ఇతర నాయకులు

తాళ్లపూడి: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనకు సంబంధించి తన పేరుతో లాగిన్ అయ్యి లబ్ధిదారులను అప్లోడ్ చేసి, ఫోర్జరీకి పాల్పడినట్లు తాళ్లపూడి సర్పంచ్ నక్కా అనురాధ తెలిపారు. తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ అనురాధ, ఆమె భర్త బీసీ నాయకుడు నక్కా చిట్టిబాబు, ఇతర నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనురాధ, చిట్టిబాబు మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజనకు ఫోర్జరీపై జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. గ్రామానికి సంబంధం లేని పోచవరం గ్రామానికి చెందిన నీరుకొండ అనిల్ కొందరి సాయంతో ఈ చర్యకు పాల్పడినట్టు వివరించారు. బీసీ మహిళ అయిన తనను అప్రదిష్ట పాలు చేసేందుకు ప్రయత్నం చేశారని, ఈ విషయంలో ఎంత మందికి పాత్ర ఉన్నా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారులు మోసపోకుండా చూడాలన్నారు. సైబర్ క్రైం కింద నమోదు చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వనిమిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ గోలి అన్నవరం, ఐతం మణికంత, ఇర్లపాటి నవీన్ పాల్గొన్నారు.

యాత్ర కష్టాలు

- రాష్ట్రంలో ఉమ్రా యాత్రకు వ్యాక్సిన్ సర్టిఫికెట్ నిరాకరణ
- తెలంగాణ వెళ్లి తీసుకుంటున్న ముస్లింలు
- లేకుంటే మక్కాకు అనుమతి లేదు



వ్యాక్సినేషన్ సర్టిఫికెట్



మక్కాలో ముస్లింల పుణ్యస్థలం

కొత్తపేట: ఉమ్రా యాత్ర ముస్లింలకు అతి పవిత్రమైంది.. అలాంటి యాత్రకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనట్లు రాష్ట్రంలో పరిస్థితి ఉంది. ఇక్కడి నుంచి ఉమ్రా యాత్రగా మక్కా వెళ్లే ముస్లింలకు వ్యాక్సిన్‌తో పాటు ఆ సర్టిఫికెట్ జారీ చేసేవారు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ముస్లింలు ఎంతో పవిత్ర పుణ్య స్థలమైన సౌదీ అరేబియాలో మక్కాకు ఉమ్రా యాత్రగా వెళ్తుంటారు. ఈ యాత్రకు హజ్ రోజుల్లో మినహా 10 నెలల్లో ఉమ్రాకు వెళ్తారు. చైనాలో కొత్త వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఫిబ్రవరి 1 నుంచి ఉమ్రా యాత్రకు వెళ్లే ముస్లింలు విధిగా వ్యాధి నిరోధక టీకా (వ్యాక్సిన్) వేయించుకుని, దానికి సంబంధించి సర్టిఫికెట్ తీసుకు రావాలని సౌదీ ప్రభుత్వం నిబంధన విధించింది. ఉమ్రా యాత్రకు వెళ్లేందుకు 10 రోజుల ముందు 'క్వాడ్రివాలెంట్ నీసేరియా మెనింజైటిస్' అనే వ్యాక్సిన్ వేయించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి అత్యధిక సంఖ్యలో ముస్లింలు ఉమ్రా యాత్రకు వెళుతున్నారు. అయితే రాష్ట్రంలో ఈ వ్యాక్సిన్ సరఫరాకు గాని, ప్రైవేట్ కంపెనీల నుంచి వ్యాక్సిన్ తీసుకుని వేయించుకున్నా సర్టిఫికెట్ ఇచ్చేందుకు గాని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రైవేట్ కంపెనీల ద్వారా ఇంజెక్షన్ ఉన్నా, సర్టిఫికెట్ ఇచ్చే అధికారం లేదని పలువురు ముస్లింలు వాపోయారు. కేవలం ప్రభుత్వ ఆస్పత్రులు ద్వారా ఇచ్చే సర్టిఫికెట్ మాత్రమే చెల్లుబాటు అవుతుంది. రాష్ట్రంలో ఉమ్రా టీకా సర్టిఫికెట్ ఇవ్వడానికి ప్రభుత్వ వైద్య సంస్థలు, వైద్యాధికారులు నిరాకరించడంతో గత్యంతరం లేక ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పక్క రాష్ట్రం తెలంగాణ (హైదరాబాద్) వెళ్లి వ్యాక్సిన్ వేయించుకుని, సర్టిఫికెట్ తీసుకోవాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. అక్కడ ప్రైవేట్ కంపెనీల నుంచి వ్యాక్సిన్ కొనుగోలు చేసుకుని తీసుకు వెళ్తే ప్రభుత్వ వైద్య సంస్థలు వ్యాక్సిన్ వేసి, సర్టిఫికెట్ ఇస్తున్నాయని వివరించారు. అయితే అక్కడ వ్యాక్సినేషన్ బుధ, శనివారాలు మాత్రమే చేస్తున్నారు. దారి ఖర్చులు, వసతికి రూ.వేలు ఖర్చు అవుతుందని, ఒక్కోసారి రెండు, మూడు రోజులు ఉండాల్సి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా ఉమ్రా వెళ్లే ముస్లింలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ తమ ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని వ్యాక్సినేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని పలువురు ముస్లింలు కోరుతున్నారు.

హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది



నేను ఉమ్రా యాత్రకు వెళ్తున్నాను. వ్యాక్సిన్ వేయించుకున్నట్టు సర్టిఫికెట్ తీసుకు రావాలని సౌదీ అరేబియా గవర్నమెంట్ నిబంధన మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడా వ్యాక్సిన్ లభ్యం కాలేదు. ఇతర ప్రాంతాల నుంచి వ్యాక్సిన్ తెచ్చుకుని చేయించుకున్నా సర్టిఫికెట్ ఇవ్వమని నిరాకరించారు. దీంతో ఈ నెల 29న హైదరాబాద్ వెళ్లి రూ.4,500 వెచ్చించి వ్యాక్సిన్ కొనుగోలు చేస్తే ఆ రాష్ట్ర ప్రభుత్వ హాస్పటల్ వైద్యులు ఉమ్రా యాత్ర పాస్‌పోర్టు చూసి, వ్యాక్సిన్ వేసి, సర్టిఫికెట్ ఇచ్చారు. ఇలా నాతో పాటు రాష్ట్రంలో వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వ్యాక్సినేషన్లు సెంటర్లు ఏర్పాటు చేయాలి.

– షేక్ గౌస్‌మొహిద్దీన్, మైనార్టీ నాయకుడు, కొత్తపేట

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

యువతి అదృశ్యం

ముమ్మిడివరం: తన కుమార్తె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంక గ్రామానికి చెందిన యువతి (25) గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె తండ్రి సుబ్రహ్మణ్యం శుక్రవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.జ్వాలాసాగర్ తెలిపారు.

ముగిసిన జాతీయ స్థాయి టెక్ హ్యాకథాన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి టెక్ హ్యాకథాన్ పోటీలు శుక్రవారంతో ముగిసినట్టు యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. దేశంలో 20కి పైగా ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 300 మందికి పైగా విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొని స్మార్ట్ అగ్రికల్చర్, హెల్త్‌కేర్, ఎనర్జీ మేనేజ్‌మెంట్, స్మార్ట్ ట్రాన్స్‌పోర్టేషన్, క్లీన్ ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించినట్టు తెలిపారు. విద్యార్థుల ప్రదర్శనల ఆధారంగా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన టాప్–5 జట్ల లో మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ గుంటూరు, నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశాఖపట్నం, చైతన్య భారతీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొద్దుటూరు, తదితర జిల్లాల నుంచి వచ్చిన ప్రముఖ కాలేజీల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

కబ్జాదారులకు పోలీసుల వత్తాసు ఏంటో!

- బాధితుడు ఫిర్యాదు చేస్తే సీఐ బెదిరించడం సరికాదు
- అమలాపురం డీఎస్పీకి పరిస్థితిని వివరించిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



రావులపాడు వివాదాస్పద స్థలం వద్దకు ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతారా.. కూటమి పాలనలో ప్రజలకు రక్షణ ఇదేనా అంటూ కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పోలీసుల తీరుపై ప్రశ్నించారు. రావులపాడు జంక్షన్ వద్ద ఒక స్థలానికి సంబంధించి అన్నదమ్ముల మధ్య వివాదం కోర్టులో నడుస్తోంది. ప్రస్తుతం ఆ స్థలంలో ఇద్దరి అన్నదమ్ముల్లో ఒకరైన మల్లిడి శ్రీనివాసరెడ్డి కర్రల వ్యాపారం (అడితి) నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం మరో సోదరుడైన మల్లిడి సత్తిరెడ్డి తాలూకా వ్యక్తులతో పాటు, మండపేటకు చెందిన కొంతమంది ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని, కర్రల అడితిని ధ్వంసం చేసి తాత్కాలికంగా టెంట్లు వేశారని ఆరోపణ. వ్యాపారిని లోనికి రానివ్వకుండా భయభ్రాంతులకు గురిచేశారని సమాచారం. దీనిపై స్థానిక టౌన్ సీఐ శేఖర్‌బాబుకు ఫిర్యాదు చేయగా, అవతల వ్యక్తికి సంబంధించిన పత్రాలు ఉన్నాయని, నువ్వు అక్కడకు వెళ్తే నీ మీద కేసు కట్టాల్సి వస్తుందని బెదిరించినట్లు మల్లిడి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిపై బాధితుడు మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. తనను వ్యాపారం చేయకుండా బయట వ్యక్తులు తీసుకువచ్చి కర్రలు పక్కకు గెంటివేసి స్థలాన్ని ఆక్రమించుకున్నారని, కోర్టులో వివాదం ఉండగా పోలీసులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారంటూ వివరించారు. దీంతో జగ్గిరెడ్డి శుక్రవారం స్థానికులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ర్యాలీగా వివాదాస్పద స్థలం వద్దకు చేరుకుని అక్కడ పోలీసులను అడిగారు. ఈ సమయంలో కాస్త ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో స్థానికులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తాత్కాలిక టెంట్లను తొలగించారు. అక్కడ నుంచి ర్యాలీగా రావులపాలెం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని జరిగిన సంఘటనపై అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌కు జగ్గిరెడ్డి వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుంటే పోలీసులు చూస్తూ ఉండడం ఏంటని ప్రశ్నించారు. బయట వ్యక్తులు వచ్చి కొత్తపేట నియోజకవర్గంలో లేని సంస్కృతికి నాంది పలికారన్నారు. స్థానిక వ్యాపారులను ఇబ్బంది పెట్టేలా బయట వ్యక్తులు జోక్యం చేసుకోవడం సరైన పద్ధతి కాదని, దీనిపై పోలీసులు వారికి కాపలా కాయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. బాధితుడికి వ్యాపారం చేసుకోవడానికి అటవీశాఖ అధికారులు ఆ స్థలంలో ఇచ్చిన లైసెన్సు ఉందని, కరెంటు బిల్లు కడుతున్న మీటరు కనెక్షన్ ఉందని వివరించారు. ఈ వివాదంపై పోలీసులు చట్టప్రకారం వ్యవహరించాలన్నారు. అసాంఘిక శక్తులను అడ్డుకోవాల్సిన పోలీసులు ఆ పని చేయకపోవడంతో ప్రజాప్రతినిధిగా తాను రావాల్సి వచ్చిందని జగ్గిరెడ్డి వివరించారు. కోర్టు తీర్పు వచ్చేవరకూ అక్కడ వ్యాపారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం రాకుండా అక్కడ వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో జగ్గిరెడ్డి అక్కడ నుంచి బయటకు వచ్చారు. జగ్గిరెడ్డి వెంట మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ముసునూరి వెంకటేశ్వరరావు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, ముత్యాల వీరభద్రరావు, కప్పల శ్రీధర్, తమ్మన శ్రీను, బొక్కా వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ ఘటనపై కేసులు నమోదు చేశారు. పోలీసు విధులకు ఆటంకం కలిగించారంటూ ఏఎస్సై పి.వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా 191 మందిపై కేసు నమోదు చేశారు. అలాగే వివాదంలో అన్నదమ్ముల్లో ఒకరైన మల్లిడి సత్తిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై మల్లిడి శ్రీనివాసరెడ్డి, తరుణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జవ్వాది రవిబాబు, గొల్లపల్లి డేవిడ్‌రాజు తదితర 191 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శేఖరబాబు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు



స్థానికులు, వైఎస్సార్ సీపీ శ్రేణులను అడ్డుకుంటూ..


వృద్ధ దంపతుల ఆత్మహత్య

కాకినాడ క్రైం: జగన్నాథపురం ఉప్పుటేరులో దూకి వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. దంపతుల్లో భర్త వయసు 65 ఏళ్లు కాగా, భార్య వయసు 60 ఏళ్లని కాకినాడ జగన్నాథపురానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. భార్య అనారోగ్యంతో బాధపడుతోందని, వారి పిల్లలు విదేశాల్లో ఉంటున్నారని ఈ నేపథ్యంలో అనారోగ్యాన్ని తాళలేక వృద్ధురాలు, ఆమె వేదన చూడలేక మనోవేదనకు గురైన భర్త ఇద్దరూ చనిపోవాలని నిర్ణయించుకున్నారన్నారు. అనుకున్నదే తడవుగా జగన్నాథపురం వంతెన నుంచి ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతదేహాలను గుర్తించిన కుటుంబ సభ్యులు ఉప్పుటేరు నుంచి తీసి అంతిమ సంస్కారాలు నిర్వహించారని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదని, పూర్తి వివరాలు తెలియరాలేదని కాకినాడ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

8 నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఫిబ్రవరి 8 నుంచి 10 వరకూ వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి సెమినార్, క్రీడా పోటీలను రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎల్.జార్జి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు శుక్రవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పనిచేస్తూ, ప్రభుత్వ ఐడీ ఉన్న ప్రతి వ్యాయామ ఉపాధ్యాయులు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఈ నెల 2న ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు డీఎస్ఏ క్రీడామైదానంలో ఎంపిక చేస్తామని, ఆసక్తి గల వారు హాజరుకావాలని సంఘ కార్యదర్శి నూకరాజు, కోశాధికారి రవికొర్ తెలిపారు.

రత్నగిరిపై భక్తుల సందడి



స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు

అన్నవరం: మాఘ మాసం సందర్భంగా రత్నగిరిపై భక్తుల రద్దీ పెరిగింది. నెల రోజుల విరామం అనంతరం వివాహాలు కూడా మొదలవడంతో పెళ్లి బృందాల హడావుడితో ఆలయ ప్రాంగణం, వివాహ మండపాలు, వివిధ సత్రాలు కనిపించాయి. శుక్రవారం 25 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు గోశాలలో సప్త గోవులకు పూజలు చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు రెండు వేల వరకూ నిర్వహించగా, అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మంది భోజనం చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివాహాల సందడి ప్రారంభమవడంతో శని, ఆదివారాల్లో రత్నగిరిపై రద్దీ కొనసాగనుంది. శనివారం ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై, ఆదివారం ఉదయం పది గంటలకు స్వామివారి రథసేవ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు.

పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈఓ ఆత్మహత్య

ఘటనలో అంతుచిక్కని విషయాలు



నక్కా నారాయణ మూర్తి(ఫైల్)

కరప/ కాకినాడ క్రైం: కాకినాడ భానుగుడి కూడలిలో సేఫ్ ఆసుపత్రి పక్కన ఉన్న ఓ లాడ్జిలో కరప వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఇన్‌చార్జి సీఈఓ నక్కా నారాయణమూర్తి (27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన గత బుధవారం అక్కడ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. మూడు రోజుల పాటు బస చేసి అద్దె చెల్లించాడు. మూడో రోజు అద్దె కోసం లాడ్జి సిబ్బంది రూమ్‌కు వచ్చి బెల్ కొట్టగా తలుపు తీయలేదు. దీంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి తలుపు తీయగా నారాయణమూర్తి ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఘటనపై సెక్షన్ 194 బీఎన్ఎస్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని కాకినాడ టూ టౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియ రాలేదన్నారు. ఇదిలా ఉంటే నారాయణమూర్తి మరణంపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. సీసీ టీవీ ఫుటేజీలు తక్షణమే విడుదల చేయాలని లాడ్జి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సీసీ కెమెరాలు పనిచేయడం లేదని సమాధానం ఇవ్వడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబీకులు గ్రామస్తులతో సహా రోడ్డుపైనే బైఠాయించి తమ నిరసన తెలిపారు.

అసలేం జరిగిందంటే..

కరప గ్రామానికి చెందిన నక్కా వీరబాబు కుమారుడు నారాయణమూర్తి కరప పీఏసీఎస్‌లో కొంతకాలం క్లర్క్‌గా పనిచేశారు. గతేడాది ఇన్‌చార్జి సీఈఓగా నియమితులయ్యారు. కాకినాడ వెళ్లి, ఒక ప్రైవేట్ రెసిడెన్సీలో రూమ్ అద్దెకు తీసుకుని, సూసైడ్ నోట్‌రాసి, ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాడ్జి గదిలో నారాయణమూర్తి ఉరేసుకుని ఉన్న తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. ఒక సంచి, పక్కన తాడు ముక్కలు, మంచంపై పక్కవేసిన దుప్పటి తీరు చూస్తుంటే అనుమానాస్పదంగా ఉందంటున్నారు. సీలింగ్ ఫ్యాన్‌కు పగ్గంతాడు పెద్దదిగా ఉండటం, ఉరేసుకుని మోకాలు మంచంపై ఆని ఉండడం, పక్కనే మంచంపై కుర్చీ, టవల్ ఉండటం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఎంతమంది లాడ్జికి వెళ్లారు, ఎవరైనా హత్యచేసి, ఉరేశారా, మరేమైనా కారణాలు ఉన్నాయా అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.



లాడ్జి ముందు గ్రామస్తుల నిరసన



లాడ్జి గదిలో లభ్యమైన సూసైడ్ నోట్‌లు

సొసైటీ సొమ్ము దుర్వినియోగంపై విచారణ

గతేడాది కరప పీఏసీఎస్‌కు ఇన్‌చార్జి సీఈఓగా నారాయణమూర్తి నియమితులయ్యారు. కొంతమంది రైతులు సొసైటీ నుంచి తాము తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించారు. వారిలో ఒక రైతు తాను చెల్లించిన సొమ్ము జమ అయిందీ, లేనిదీ కరప డీసీసీబీ బ్రాంచ్‌లో రశీదు చూపించి, అడిగాడు. రికార్డులలో సదరు సొమ్ము జమ కాకపోవడంతో కో–ఆపరేటివ్ బ్యాంక్ అధికారులకు అనుమానం వచ్చి కరప పీఏసీఎస్‌లో లోన్ రికార్డులు పరిశీలించగా నిధులు భారీగా పక్కదారి పట్టినట్టు గుర్తించారు. దీనికి ఇన్‌చార్జి సీఈఓ మూర్తిని బాధ్యుడిని చేస్తూ, తిరిగి చెల్లించాలని అధికారులు పట్టుపట్టినట్టు తెలిసింది. అప్పటి వరకూ జెడ్.భావారం సీఈఓ ఆర్.వెంకటేశ్వరరావుకు బాధ్యతలు అప్పగించారు. సీఈఓగా తనను తప్పించడం, చేయని తప్పునకు ఇరికించడాన్ని అవమానంగా భావించిన నారాయణమూర్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్నేహితులు చెబుతున్నారు. దీనిపై కరప సొసైటీ ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా రికార్డుల ప్రకారం రూ.12 లక్షల వరకూ సొసైటీ సొమ్ము దుర్వినియోగమైనట్టు విచారణలో తెలిసిందన్నారు. అందులో కొంత రికవరీ చేశామని, మిగిలిన సొమ్మును చెల్లించాలని నారాయణమూర్తి కుటుంబ సభ్యులకు చెప్పారన్నారు. ఇంతలో ఇలా జరగడం విచారకరమని చెప్పారు.

వెలుగులోకి సూసైడ్ నోట్

ఇన్‌చార్జి సీఈఓ నారాయణమూర్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న గదిలో మూడు రకాల పేపర్లు లభ్యమయ్యాయి. పసుపురంగు పేపర్‌పై అమ్మా జాగ్రత్త, నువ్వు హ్యాపీగా ఉండు, నేను పైన హ్యాపీగా ఉంటా.. అక్కా జాగ్రత్త నేను ఎలాంటి తప్పు చేయలేదు, పిల్లలను జాగ్రత్తగా చూసుకోండి. ఆఫీసు అటెండర్, ఫ్రెండ్స్ జాగ్రత్తగా ఉండండి, ఓకేనా వెళ్తున్నా అని రాసి ఉంది. ఎవరికీ ఎలాంటి మనీ ఇవ్వనవసరం లేదు, ఎవరు వచ్చినా అబద్ధాలు చెప్తారు, నమ్మకండి. నేను చేయకుండా తప్పులో ఇరికించారు. తెల్ల కాగితంపై నా ఫ్రెండ్స్ అందరికీ చెప్తున్నా జాగ్రత్తగా ఉండండి, ఎవరినీ ఎక్కువ నమ్మకండి అని ఇంకా, అమ్మా, నాన్నకు రాస్తూ అక్క, బావ, వాళ్ల పిల్లల్ని ఇంటికి తీసుకొచ్చి, మీ దగ్గరే ఉంచుకోండని ఉంది.